

కరీంనగర్ కలెక్టరేట్ మెయిన్ గేట్ ఎదుట నిరసన తెలుపుతున్న చేనేత కార్మికులు

# కరీంనగర్‌లో నేత కార్మికుల ధర్నా

**అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్**

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తికి చెందిన నేత కార్మికులు శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. కార్మికుల ఇండ్లల్లో కొన్ని రోజులుగా ఈడీ అధికారులు దాడులు చేస్తూ మరమగ్గాలను సీజ్ చేస్తూ కేసులు పెడుతున్నారని వంద మందికిపైగా చేనేత కార్మికులు ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. కార్మికులకు ఉపాధి కల్పించాలని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని నినదించారు. సాదా చీరలు మాత్రమే నేసే జీవో ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మగ్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్తు సరఫరా చేయాలని కోరారు. గతంలో నేసిన చీరల డబ్బులు విడుదల చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో గర్శకుర్తి గ్రామ చేనేత, పవర్‌లూమ్ కార్మిక సంఘం గౌరవ సలహాదారుడు అన్నల్‌దాస్ శ్రీనివాస్, అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా - ఉద్యోగ సమాచారం

### వంద డిగ్రీ కాలేజీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): వచ్చే విద్యాసంవత్సరంలో 100 డిగ్రీ కళాశాలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రవేశపెట్టాలని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం శనివారం సెక్టార్ స్కిల్ కౌన్సిళ్లు, కళాశాల విద్యాశాఖ, వర్సిటీల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. చదువుతూనే విద్యార్థులకు సంపాదించుకునే వెసులుబాటు కల్పించేలా తీర్చిదిద్దనున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో 30 డిగ్రీ కాలేజీల్లోనే 36 కోర్సులను ప్రవేశపెట్టారు. ఈ సంఖ్యను 100కు పెంచాలని నిర్ణయించారు. ఏయే రంగాల్లో ఏ కోర్సులను ప్రవేశపెట్టవచ్చో గుర్తించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వచ్చే విద్యాసంవత్సరంలో జిల్లా కేంద్రాల్లోని విద్యార్థులు అధికంగా ఉన్న కాలేజీల్లో ఈ కోర్సులకు ప్రవేశపెడతారు. ప్రైవేట్ కాలేజీలకు సైతం అవకాశం కల్పించనున్నట్టు అధికారులు తెలిపారు.

### • రేపు ఇంటర్ హాల్‌టికెట్ల విడుదల

హైదరాబాద్: ఇంటర్ వార్షిక పరీక్షల హాల్‌టికెట్లు సోమవారం విడుదలకానున్నాయి. ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో ఈ హాల్‌టికెట్లను పొందుపరు స్తారు. ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు వార్షిక పరీక్షలు జరుగుతాయి. ఈ ఏడాది పరీక్షల కోసం 1,521 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేయగా, 9.8 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

### • 'నియామకాల్లో మహిళలకు సమాంతర రిజర్వేషన్లు'

హైదరాబాద్: ఉద్యోగ నియామకాల్లో మహిళలకు సమాంతర రిజర్వేషన్లను అమలుచేయనున్నట్టు (హారిజాంటల్ రిజర్వేషన్) టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శనివారం వెబ్‌నోట్ విడుదల చేశారు. సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు, ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అమలుచేస్తామని ప్రకటించారు.

### • రేపటి నుంచి జేఎల్ అభ్యర్థులకు డెమోలు

హైదరాబాద్: గురుకుల జూనియర్ కాలేజీ లెక్చరర్ పోస్టుల భర్తీకి తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) చర్యలు చేపట్టింది. గతంలో నిర్వహించిన పరీక్ష నుంచి ఎంపిక చేసిన 1:2 మెరిట్ జాబితాను విడుదల చేసింది. 19 నుంచి 22 వరకు అభ్యర్థులకు డెమోలను నిర్వహించాలని నిర్ణయించింది. సబ్జెక్టుల వారీగా అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరచింది.

# సంకల్ప బలంతో లక్ష్యసాధన

- విద్యార్థులకు లైఫ్ గైడ్‌గా కేఎల్ యూనివర్సిటీ
- వర్సిటీ ప్రొఫెసర్ ప్రశాంత్
- పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి: కేఎల్ వర్సిటీ ప్రొఫెసర్ గీత
- 'నమస్తే తెలంగాణ-తెలంగాణటుడే', కేఎల్ వర్సిటీ ఆధ్వర్యంలో పాలమూరులో అవగాహన సదస్సు




మహబూబ్‌నగర్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి స్మార్ట్ వాచ్ బహూకరిస్తున్న నమస్తే తెలంగాణ బీఎం రాజశేఖర్, అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్ విజయ్‌కుమార్‌రెడ్డి, కేఎల్ వర్సిటీ ప్రొఫెసర్లు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 17: సంకల్పం బలంగా ఉన్నప్పుడు ఎదుగుదలను ఎవరూ ఆపలేరని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్ అన్నారు. ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని వాటికి అనుగుణంగా అడుగులు వేయాలని సూచించారు. మరింత మంచి లైఫ్‌కు గైడ్‌గా కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులకు తోడుంటుందని చెప్పారు. శనివారం 'నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే', కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'ఇంటర్ తర్వాత ఉన్నత విద్యా అవకాశాలు' అనే అంశంపై 'లక్ష్యం-2024' పేరిట విద్యార్థులకు అవగాహన సదస్సును మహబూబ్‌నగర్‌లోని క్రౌన్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు వాగ్దేవి కళాశాల విద్యార్థులు 500 మందికిపైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. మెరిట్ స్టూడెంట్స్‌కు రూ. 100 కోట్ల స్కాలర్‌షిప్‌లను కేఎల్ యూనవర్సిటీ అందిస్తుందని చెప్పారు. రూ.60 లక్షల వార్షిక ప్యాకేజీతో యూనివర్సిటీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు వచ్చినట్టు తెలిపారు. దేశ, విదేశాల్లోనూ కేఎల్ యూనివర్సిటీకి 70 నుంచి 80 యూనివర్సిటీల్లో అనుబంధం ఉన్నదని, వారితో ప్రత్యేకంగా సంప్రదింపులు జరిపి ఉద్యోగ అవకాశాలను అందుబాటులో ఉంచే బాధ్యత తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

**నాలుగేండ్లు కష్టపడితే చాలు..**

నాలుగేండ్లు కష్టపడి చదివితే జీవితంలో స్థిరపడతారని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గీత సూచించారు. వాగ్దేవి జూనియర్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సమయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వృథా చేయొద్దని సూచించారు. అనంతరం ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన వారికి కేఎల్ యూనివర్సిటీ బహుమతులు ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో 'నమస్తే తెలంగాణ' బ్రాంచి మేనేజర్ రాజశేఖర్, అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజర్ విజయ్‌కుమార్‌రెడ్డి, యాంకర్ ఆదిత్య, కేఎల్ యూనివర్సిటీ మేనేజర్లు వెంకటేశ్, నరేశ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## లోకం పోకడ




అబ్బే.. మనగురించి కాదేమో సార్.. అది ఎప్పుడో రాసి పెట్టాడు!

# వెళ్లండి.. స్టే తెచ్చుకోండి!

మొదటిపేజీ తరువాయి...

కూడా ఇదే చేయబోతున్నారు. పోస్టుల భర్తీలో గోల్‌మాల్ జరిగిందని, తమకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించబోతున్నారు. అసలు విషయం ఏమిటంటే.. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లోని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ 275 పోస్టుల భర్తీకి తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) గత ఏప్రిల్ 24 నుంచి మే 24వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించింది. నోటిఫికేషన్‌లో 2023 ఏప్రిల్ 5వ తేదీనాటికి పీడీ పోస్టులకు బీపీఎడ్ తదితర విద్యార్హతలు ఉన్న అభ్యర్థులే అర్హులుగా ప్రకటించింది. ఆ లెక్కన గత మే నాటికే అభ్యర్థులు ఆయా విద్యార్హతలు కలిగి ఉండాలి. కానీ, గత అక్టోబర్‌లో పాసైన అభ్యర్థికి సైతం పోస్టింగ్ ఇచ్చిందని అభ్యర్థులు ఆధారాలతోసహా బయటపెట్టారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు విరుద్ధంగా పోస్టులను భర్తీచేశారని, ఏపీకి చెందిన నాన్‌లోకల్ అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చారని, జోనల్ పోస్టులను మల్టీజోనల్ పోస్టులుగా మార్చారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ఓ మంత్రిని పలువురు అభ్యర్థులు కలిసి పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలను వివరించారు. న్యాయం చేస్తానని హామీ ఇవ్వాల్సిన మంత్రి.. అందుకు విరుద్ధంగా 'కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోండి' అంటూ ఉచిత సలహానివ్వడంతో అభ్యర్థులు ఖంగుతిన్నారు.

**మీడియాకు మొఖం చాటేసిన ట్రిబ్**

స్కూల్ పీడీ, పీజీటీ పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో, లేవనెత్తుతున్న అంశాలపై వాస్తవాలను తెలుసుకునేందుకు మీడియా ప్రతినిధులు తొలుత సంప్రదించగా.. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారమే అంతా నియామకాలు జరిగాయని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చని, వాటిని పరిశీలిస్తామని మాత్రమే చెప్తూ దాటవేస్తున్నారు. ఇదే విషయమై కలిసేందుకు పాత్రికేయులు ఎంత ప్రయత్నించినా ట్రిబ్ అధికారులు మాత్రం పూర్తిగా ముఖం చాటేస్తున్నారు. ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్న ఫలితం లేకుండా పోయింది.

**చెక్‌చేస్తాం.. పోస్టులు మాత్రమివ్వం..**

పోస్టుల భర్తీపై అనేక ఆరోపణలు వస్తున్నా ట్రిబ్ అధికారులు నోరుమెదపడం లేదు. స్కూల్ పీడీ పోస్టుల అభ్యర్థులకు రాత పరీక్షతోపాటు డెమోలు నిర్వహించాల్సి ఉన్నది. ఆ రెండింటి మార్కులను ప్రకటించాలి. కానీ, ఇప్పటివరకు ట్రిబ్ క్యాటగిరీలవారీగా కటాఫ్ మార్కులను కూడా ప్రకటించలేదు. అభ్యర్థులకు డెమో మార్కులనే వెల్లడించింది. అది కూడా ఓపెన్‌గా కాకుండా అభ్యర్థులకు వ్యక్తిగతంగా వారి లాగిన్ ఐడీల్లోనే పొందుపరిచింది. మార్కుల జాబితాను ప్రకటించలేదు. మార్కులు, డెమోకు సంబంధించిన మార్కులను కలిపి కటాఫ్ ప్రకారం వెల్లడించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. స్కూల్ పీడీ పోస్టుల భర్తీ ప్రక్రియపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ పలువురు అభ్యర్థులు ట్రిబ్ ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నారు. అభ్యర్థుల ఫిర్యాదు మేరకు జాబితాను చెక్‌చేస్తామని అధికారులు చెప్పడం గమనార్హం. ఒకవేళ తప్పు జరిగినట్టు తేలినా ఆ పోస్టులను బ్యాక్‌లాగ్ పెడతాం తప్ప తదుపరి అభ్యర్థులకు మాత్రం ఇచ్చేది లేదని వెల్లడించారని అభ్యర్థులు వాపోతున్నారు. ప్రభుత్వం ఆర్డర్ ఉంటేనే ఆ పోస్టులను భర్తీ చేస్తామని చెప్తున్నారని, ఏ ఒక్క ప్రశ్నకు ట్రిబ్ స్పష్టతనివ్వడం లేదని మండిపడుతున్నారు. ఇటు ట్రిబ్ అధికారుల తీరు, అటు ప్రభుత్వ పెద్దల నుంచి నిర్లక్ష్య సమాధానాల నేపథ్యంలో పలువురు అభ్యర్థులు రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఎవరికి వారుగా పిటిషన్లను దాఖలు చేయాలని నిర్ణయించుకున్నారు.

**నాడు ధర్నా చేయించి.. నేడు మొఖం చాటేసి**

616 పీఈటీ పోస్టుల భర్తీకి 2017లో ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. తొలుత ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా చేసిన అభ్యర్థులే అర్హులని ప్రకటించింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీపీఎడ్ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం వారిని కూడా పీఈటీ పోస్టులకు అర్హులుగా ప్రకటించింది. అనంతరం పరీక్షను నిర్వహించింది. 1:2 నిష్పత్తిలో మొత్తంగా 1200 మంది అభ్యర్థులను ఎంపిక చేసి సర్టిఫికేషన్ వెరికేషన్ చేపట్టింది. 600 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన తరుణంలో డిప్లొమా చేసిన అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఆ పోస్టులు తమకు మాత్రమే చెందాలని వాదన మొదలుపెట్టారు. నాటి నుంచి ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ అలాగే పెండింగ్‌లో పడిపోయింది. ఆ బాధిత అభ్యర్థులతో ప్రస్తుతం ప్రభుత్వంలోని పలువురు పెద్దలే దగ్గరుండి ధర్నా చేయించారు. కాంగ్రెస్ సర్కార్ రాగానే తొలుత ఇదే సమస్యను పరిష్కరించి పోస్టుల భర్తీ చేపడతామని నాడు రేవంత్‌రెడ్డి సైతం హామీ ఇచ్చారు. కానీ, నేడు గతంలో రాతపరీక్షలు పూర్తయిన స్టాఫ్ నర్స్ మొదలు, ఇతర అన్ని పోస్టుల భర్తీ చేస్తున్నా ఈ సమస్యను పరిష్కరించేందుకు మాత్రం మొఖం చాటేస్తున్నారని అభ్యర్థులు మండిపడ్డుతున్నారు.

**పీజీటీ పోస్టులపైనా అనుమానాలు..!**

స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టులపైనే కాకుండా ఇటీవల భర్తీ చేసిన పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టులపైన కూడా అభ్యర్థులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అన్ని గురుకులాల్లో కలిపి మొత్తంగా 1,276 పీజీటీ పోస్టుల భర్తీకి ఇటీవల 1:2 నిష్పత్తి ప్రకారం అభ్యర్థుల జాబితాను విడుదల చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారు. అన్ని సబ్జెక్టులకు ఒకే రోజున, అదీ సమాచారమిచ్చిన ఒక రోజు వ్యవధిలోనే ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. అనేక మంది నాన్‌క్రీమీలేయర్ తదితర సర్టిఫికెట్లను కూడా సమర్పించలేదు. ట్రిబ్ మెడికల్ టెస్టులను కూడా నిర్వహించలేదు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేసిన మరుసటి రోజు అర్ధరాత్రికే పోస్టులకు ఎంపికైన జాబితాను విడుదల చేసేసింది. ఈ పోస్టులకు కూడా ఇప్పటివరకు క్యాటగిరీలవారీగా మార్కుల కటాఫ్‌ను ట్రిబ్ వెల్లడించలేదు. నిబంధనల ప్రకారం వెబ్‌లోనూ పొందుపరచలేదు. ఎంపికైన అభ్యర్థుల హాల్‌టిక్కెట్లను మాత్రమే ప్రకటించింది. దీంతో ఈ నియామకాలపైనా అభ్యర్థులు తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు.

